


స్టూడియో మెయిన్ గేటుకి అరటి చెట్లు, పచ్చని తోరణాలూ...

కొత్త సినిమాకి ముహూర్తం.

ఫ్లోర్లో ఒకమూల టెంపరరీగా ఏర్పాటు చేయబడ్డ పూజా మండపం—మండపంలో ప్రముఖంగా ఏడుకొండలవాడూ, లక్ష్మీదేవీ, విఘ్నేశ్వరుడూ, అయ్యప్ప, సాయిబాబా, ఇంకా కొందరు చిల్లర దేవుళ్ళూ ఫ్రేము కట్టిన పటాల రూపంలో ఉన్నారు. ఆ ఫోటోలనిండా పసుపు, కుంకాలు మెత్తేసి ఆ దేవుళ్ళ శాల్తీలు తెలియకుండా చేసేసేడు పురోహితుడు.

కింద ఒక గంపనిండా కొబ్బరికాయలు, పటిక బెల్లం ముక్కలూ ఉన్నాయి.

కొత్త సినిమా నిర్మాత కోదండం గంజిపెట్టిన కాకీ నిక్కర్లో, అప్పుడే ప్రెస్సు నించి వచ్చిన వంద రూపాయి నోటులా ఫెళ ఫెళ్ళాడి పోతున్నాడు.

ఆయన కంపెనీలో పనిచేస్తున్న వాళ్ళూ, ఎందుకైనా మంచిదని చూడ్డాని కొచ్చినవాళ్ళూ, పిలవకపోయినా సొంత బావ మరుదుల్లా అందరి కాళ్ళకూ అడ్డాలడి తిరుగుతున్న ఏరియా వ్యాపారవేత్తలూ, నూతన నటీ నటులూ నోట్లో ఉన్న పిప్పి పళ్ళూ గీసుకోని నాలుకా కనిపించేలా, పెదాలు చెవుల్దాకా సాగదీసుకు నవ్వేస్తూ, కొత్త నిర్మాత కోదండానికి కిత కిత లెట్టేస్తున్నారు.

నూతన నటీమణుల పట్టు చీరల ఫెళఫెళల్లో మనసు పారేసుకుని, కోదండం 'సినిమాలోకం స్వర్గ సమానం' అనుకుంటుండగా—

మొదటి కొబ్బరికాయ కొట్టాల్సిన డిస్ట్రిబ్యూటర్‌గారి బావమరదికి వేలు పిడిచిన పినతల్లి కొడుక్కి తోడల్లుడు గాంచ్చేశారు.

టపాకాయ్ చప్పుడికి ఒక్కసారిగా ఎగిరి గగ్గోలు పెట్టి అరిచేస్తూ అక్కడే తిరిగే కాకుల్లా జనాభా అందరూ ఆయన్ని ఆహ్వానించారు.

ఆ రద్దీలో జనాభా కాళ్ళ కింద పడి పచ్చడై పోయి కాళ్ళూ, చేతులూ సవరించుకుంటున్న మొదటి చాన్సు దర్శకుడు శశికాంత సుధామోహాన్ని ఎవరూ పట్టించుకోలేదు!

బాగా కావలసిన వాళ్ళెవరో పోతే మొల్లున పై స్థాయిలో ఏడుస్తున్నట్టు, పురోహితుడు మంత్రాలు చదవడం ప్రారంభించాడు.

అవి పూజామంత్రాలో. చావు మంత్రాలో— చదివే పురోహితుడికే తెలియవు. ఇక మిగిలిన జనాభాకి ఏం తెలుస్తాయి !

అమ్మవారి జాతరలో కోళ్ళనీ, మేకల్నీ బలేసే వాళ్ళలాగ, అక్కడ జనాభా అందరూ ముఖాలకి కుంకం మెత్తేసుకున్నారు. అర్ధ నిమీలిత నేత్రాలతో చేతులు జోడించి భక్తపోతన, రామదాసు, తుకారాం, తులసీదాసు బాబుల్లా పవిత్రమైన ఎక్స్‌ప్రెషన్లలో మునిగిపోయారు !

అంత భక్తిలోనూ ఫోటోగ్రాఫర్ ఏ పక్కనున్నాడో వోరకంట చూస్తూనే ముహూర్తం ఫోటోలో పడాలని తాపత్రయపడిపోతున్నారు.

పూజయింది.

---

**సి. వి. రమణ**

---

ముఖ్య అతిథిని కొబ్బరికాయ కొట్టమన్నారు.

ఆయన ఒకే ఒక దెబ్బతో కాయ సగానికి కరెక్టుగా పగిలేలా కొట్టాడు (గతంలో ఆయన ఎలక్షన్ల సందర్భంలో మనుషుల బుర్రలు కూడా అంత కరెక్టుగానూ పగలగొట్టించాడు. ఆయన కిదో లెక్కా!)

కొబ్బరికాయ కరెక్టుగా సగానికి పగిలింది కనక "పిక్చర్ సూపర్ హిట్" ఇది సెంటిమెంట్ అన్నారు అక్కడి జనం! ( కొబ్బరికాయ మధ్యకి పగల్డానికి— పిక్చర్ వంద రోజు లాడ్డానికి సంబంధ మేమిటో?)

నిర్మాతగార్ని కొబ్బరికాయ కొట్టమన్నారు.

ఆయన ఫోటోలలో ఉన్న అందరూ దేవుళ్ళనూ ప్రార్థించాడు. కొబ్బరికాయ గీత గీసినట్టు సగానికి పగలాలని కోరుకున్నాడు. కళ్ళు మూసుకు పటాల్ని కొబ్బరికాయ కొట్టాడు. అది తిరపతి కొండ ఘాట్ రోడ్లా తొంబై వంకర్లతో పగిలింది. చుట్టూ ఉన్న జనాభా చప్పట్లు కొట్టి "నిర్మాత గారి కొబ్బరికాయ వంకర్లుగా పగిలింది — ఇదీ సెంటిమెంటే— పిక్చర్ హిట్" అన్నారు ( ఇక్కడ సెంటిమెంట్ అనే పదం అర సెకన్‌లో అరవై అర్థాలు మార్చుకుంటుంది. వాటిని మనం చెప్పినట్టు నమ్మితీరాలి. లేకపోతే మన్ని చంపేస్తారు). పైగా నిర్మాత కొట్టిన కొబ్బరికాయ కుళ్ళిపోయింది. మళ్ళీ జనం కోరస్‌గా "మీరు కొట్టిన కాయ కుళ్ళిపోయింది — కనక పిక్చర్ సూపర్ హిట్ అన్నారు. ( ఇది నిజమే అయి ఉండచ్చు. ఎందుకంటే కుళ్ళిపోయిన కథలే సూపర్ హిట్ సినిమాలు కనక ).


ఆటల పాటల బాలలకు
ఆటూ పోటూ ఎదురయితే...
జీవితంలో చీకటి వెలుగులు ప్రతి ఒక్కరికీ మామూలే.
అయితే చీకటిని తగ్గించటం ఎంతో మంచిది వారికి.
దాని కోసం వారు ఆరోగ్యవంతంగా ఉండటం అవసరం.
దాని కోసమే హార్లిక్స్.
హార్లిక్స్ అంటే ప్రతినిత్యం ఆరోగ్యంగా ఉండటం అన్నమాట.
అందువల్లనే కోట్లాది మంది 100కు పైగా సంవత్సరాల నుంచి హార్లిక్స్ సుగుణాలను విశ్వసిస్తున్నారు.
ప్రపంచ వ్యాప్తంగా ఉన్న డాక్టర్లంతా ఆరోగ్య సంరక్షణకు హార్లిక్స్ ఆదర్శప్రాయమైనదని శిఫారసు చేశారు.
అంటే ఆశ్చర్యం లేదు. హార్లిక్స్‌లో ఉన్న విలువైన, స్వచ్ఛమైన పోషక పదార్థాలను, వాటిమరచి గుణాలను కాపాడే విధంగా, తేలికగా జీర్ణమయే విధంగా అద్భుతమైన పద్ధతిలో మిశ్రమం చేశారు.
హార్లిక్స్ మీ కుటుంబ జీవితంలో భాగంగా ఉండేట్టు చూచుకోండి.
మీ కుటుంబ సభ్యులందరికీ కావలసిన శక్తినంతా సమకూరుస్తుంది.
Horlicks
Horlicks
THE IDEAL FOOD DRINK
మంచి పుష్టికరమైనది
HTD-HMM-7535

అందరూ టపటపా కొబ్బరికాయలు కొట్టేశారు.

ప్రొడక్షన్ మేనేజరు గొప్పగా సంతోషపడిపోతున్నాడు. ఎందుకంటే సదరు కొబ్బరి చిప్పలు టోకుగా ఉడిపీ హోటల్లో చట్నీ కింద మారిపోయి, అనక చిల్లర రూపంలో తన జేబులోకి చేరతాయి కాబట్టి!

ప్రొడక్షన్ కుర్రాళ్ళు గొల్లున ఏడిచారు, ఆ ఛాన్స్ తమకు దక్కనందుకు.

అప్పు డందరికీ జ్ఞాపకం వచ్చింది—డైరెక్టర్ చేత కొబ్బరికాయ కొట్టించలేదని!

ఆయన్ని పిలిచి వో కొబ్బరికాయ కొట్ట మన్నారు. అంతవరకూ దిక్కూ, దివాణం లేకుండా పడున్న ఆ నూతన దర్శకుడు ఇప్పటికైనా తనకు గుర్తింపు వచ్చినందుకు మనసారా దేవుణ్ణి 'తన తొలుదొల్త చిత్రమైన ఈ సినిమాను సూపర్ హిట్టు చెయ్యమని, తద్వారా తన బంగారు భవిష్యత్తుకు వో మెట్టు కట్టమని ప్రార్థించి జై సద్గురూ అని కొబ్బరికాయ కొట్టబోయి వేలు నలగ్గొట్టుకుని 'కేర్' మని అరవబోయి, నలుగురిలోనూ బావుండదని మానేసి, అయిదో ప్రయత్నంగా కొబ్బరికాయ పగలేశాడు.

జనానికి కూల్‌డ్రింకు లిచ్చారు!

'ఈ ఇండియాలో ఇలా ముహూర్తాలకీ బ్రాందీ యిచ్చే అలవాటు ఎప్పుడొస్తుందో'నని బాధపడ్డాడు వో మందు మహరాజు.

మొదటి షాట్ శుభప్రదంగా దేవుళ్ళ మీదే తీశారు.

డైలాగులు లేవు కనక మొదటి షాట్ వో. కే. అయింది.

దేవుళ్ళ ఫొటోలు బాగా నటించాయని మెచ్చుకున్నారు అందరూ నిర్మాతని.

నిర్మాతకి జనాభా పొగడ్తలకి ఛాతీ ఉబ్బిపోయి కొత్తగా కుట్టించుకున్న టెర్లీన్ చొక్కా బొత్తాలు టపటపా తెగిపోయి, చొక్కా చిరిగిపోయింది.

జనాభా వెళ్ళిపోయారు.

కొత్త నిర్మాత గొడ్డు చాకిరీ చేసిన వాడిలా అలిసిపోయి కుర్చీలో చేర్లబడిపోయాడు.

కొత్త దర్శకుడు షాట్ చెప్పాడు.

కొత్త కెమెరామేన్ లైట్లేస్తున్నా డు. ( అసలు ఆ చిత్రానికి పనిచేస్తున్న కెమెరామన్‌కి మరో పెద్ద తారల చిత్రం షూటింగ్ ఉంది కనక ఆయనరాలేదు) కొత్త నటీనటులు డైలాగులు నములుతున్నారు—( హీరో, హీరోయిన్లు బిజీ. ఈ ముహూర్తం చాలా పవర్‌ఫుల్ కనక ). చిన్న నటులతోనే ఆ పూట షూటింగు కానిస్తున్నారు. ఇదే చాన్సు కనుక నూతన నటీనటుల అమ్మలూ, నాయనమ్మలూ వాళ్ళనే చూస్తూ ఆనందపడిపోతున్నారు.

అలా తెలుగు చిత్ర లోకంలో వో కొత్త సినిమా మొలకెత్తి ంది.

మొట్ట మొదటి రోజున, అదీ ముహూర్తం నాడు—పెద్ద హీరోని ( వయసులో కూడా), పెద్ద హీరోయిన్ని ( వయసులో కాదు — సంపాదనలో )డైరెక్ట్ చేయవలసిన నూతన దర్శకుడు నూతన నటీనటుల్ని డైరెక్ట్ చేయవలసినందుకు కమిలిపోయి, ముడతః పడిపోయిన మామిడి పండులా మొహం పెట్టుకున్నాడు

అతనికి పొద్దున్నించీ అన్నీ జరగకూడనివే జరిగాయి. మొట్టమొదటగా కొబ్బరికాయ కొట్టడాని కొచ్చిన పెద్దమనిషి చుట్టూరా చేరిన భజనపరుల కాళ్ళ కింద పడి టెర్లిన్ చొక్కాతోపాటు శరీరం కూడా నలిగిపోయింది. రెండోది: కొబ్బరికాయ కొట్టబోయి వేళ్ళు పచ్చడయ్యేలా నలగ్గొట్టుకున్నాడు

మూడోది: ముహూర్తం నాడు మొహమాటం లేని వాళ్ళను ( కెమెరాముందు మొహం, మైకు ముందు మాట—ఆ రెండూ పనికిరాని వాళ్ళు ) డైరెక్టు చేయవలసి వచ్చింది

అయినా తన బంగారు భవిష్యత్తుని, తను తియ్యబోయే చిత్రం 'శంకరాభరణం' ఫక్కీలో సిల్వర్



జూబిలీలు జరుపుకోవడాన్నీ, తర్వాత అశేష ప్రజానీకం తనకు సన్మానాలు చేయడాన్నీ వూహించుకుని నిర్మాతనూ, నూతన నటులనూ క్షమించేసేడు — నూతన దర్శకుడు శశికాంత సుధామోహన్!

సెకండ్ హీరోయిన్ సుధాబాలకూ, మూడో హీరో మహ్మద్ ఆలీకి డైలాగులు చెప్పడం ప్రారంభించాడు. ( మూడో హీరో అసలు పేరు ముకుంద రావు. తెలుగు పాత నటుల పాలిట హెవీ వెయిట్ చాంపియన్ కావాలని తన అసలు పేరును మహ్మదాలీ తెరపేరుగా మార్చుకున్నాడు. )

సుధాబాల కొత్తాంధ్ర వాచకం అయిదో క్లాసు నుంచి ఎదిగి రజస్వల అయ్యాక బెడ్‌రూమ్‌కి ప్రమోషనై చలన చిత్ర పరిశ్రమకు చేరింది!

ముకుందం ఉరఫ్ మహ్మదాలీ సొంత యింటి గ్రాడెజూ బీరువానే కాక పక్కింటి వాళ్ళ ఇనప్పెట్టెని కూడా తడివితే పోలీసు వాళ్ళు ముచ్చటపడి, అతగాడికి ఆర్నెల్లు అతిథ్యమిచ్చి అనక వదిలేశాక, సరదాగా సినిమా యిండస్ట్రీకి వచ్చేశాడు.

సుధాబాలకు వక్షస్థలం ఎంత ఎత్తో—ముకుందానికి జుత్తు లంత ఒత్తు.

సుధాబాల నాలిక ఎంతవుందమో — ముకుందం చర్మం అంత ఘనం.

సుధాబాల మొహం బెడ్‌రూం ఎక్స్‌ప్రెషను ఒలకబోస్తే, ముకుందం మొహం దొంగభావాలు పుంఖానుపుంఖంగా గుప్పిస్తుంది

ఈ ఇద్దరిచేత 'లేత ప్రేమ' అభినయింప చెయ్యటానికి నానా చావులూ చస్తున్నాడు నూతన దర్శకుడు.

'రాధా బాధపడకు' అనాలి ముకుందం "రాధా భాధ ఫడకు" అన్నాడు — అన్నింటికీ ఒత్తులెట్టేసి.

దర్శకుడు ఫ్లోర్ టాపు తలకు తగిలేలా ఎగిరి వెర్రికేక వేశాడు—"అన్నింటికీ ఒత్తులెందుకు?" అని.

ముకుందం "రాదా — బాదపడకు" అని అన్ని అక్షరాలకు ఒత్తు లాగేశాడు

నూతన దర్శకుడు జుట్టు పీకేసుకుని బాహాటంగా ఏడిచేశాడు!

"ఫర్వాలేదు. తర్వాత మరొకరి చేత డబ్బింగ్ చేయిద్దాం అమ్మడి సంగతి చూడండి" అని ఇలాంటివి చూసి చూసి, విని విని బట్టతలై పోయిన సహాయ దర్శకుడు వోదార్చాడు దర్శకుణ్ణి.

ఆ వోదార్పుతో కొంచెం ధైర్యం తెచ్చుకుని నూతన దర్శకుడు సుధాబాల దగ్గరికెళ్ళి "చూడమ్మా! ఇది నీ క్లోజప్పు— నువ్వు ఏం మాట్లాడక్కరలేదు కాని—కొంచెం జాలిగా, ప్రేమగా చూడు" అన్నాడు.

సుధాబాల కళ్ళ కొలకుల్లోంచి అరమోడ్పు కన్నులతో సెక్సీగా చూసి, పెదాలు తమాషాగా కొరుక్కుంటూ జయమాలిని టైప్ ఎక్స్‌ప్రెష నొకటి విసిరింది.

నూతన దర్శకుడి గుండెలో గునపం దిగినట్టయి కెమెరా మెన్‌ని కౌగలించుకుని మూర్ఛపోయాడు. ★